క్లుప్తంగా

దళితవాడలో రహదారి ప్రారంభం



భట్టిప్రోలు: స్థానిక దళితవాడలో అంతర్గత రోడ్డు నిర్మాణానికి మోక్షం కలిగింది. ఆరో వార్డులో రూ. 9.20 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రహదారిని సర్పంచ్ దారా రవి కిరణ్మయి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భట్టిప్రోలులో ప్రధానంగా రహదారులు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ బూర్లె రామప్రసాద్, వార్డు సభ్యులు పెరికల శ్యామసుందరరావు, అబ్దుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య, దళితవాడ వాసులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌లో 162 కేసులు పరిష్కారం



రేపల్లె రూరల్: లోక్‌అదాలత్‌ల ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు తెలిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్టు హాలులో నిర్వహించిన మెగాలోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. రాజీమార్గమే రాజమార్గమని, లోక్‌అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 31 సివిల్, 129 క్రిమినల్, రెండు ప్రీలిటిగేషన్ కలిపి మొత్తం 162 కేసులు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జగదీష్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ , న్యాయవాదులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద వ్యక్తి నిరసన

వేమవరం(భట్టిప్రోలు): అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటులో జరుగుతున్న అవమానాన్ని ఖండిస్తూ ఓ వ్యక్తి నిరసనకు దిగాడు. వివరాల్లోకి వెళితే.. భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం అభివృద్ధి పనుల్లో భాగంగా సంఘ పెద్దలు అందరి సమన్వయంతో నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై గ్రామానికి చెందిన జంగం శ్యామ్ శనివారం నిరసనకు దిగాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మునిలక్ష్మి వీఆర్వో ఎస్. సురేష్‌ను వేమవరం పంపారు. ఈ నేపథ్యంలో స్థానిక గ్రామ పెద్దలు శ్యామ్‌తో సయోధ్యకు వచ్చి నిరసనను విరమింప చేశారు. వీఆర్వో సురేష్ శ్యామ్ నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ మోటార్ల చోరీ

కొల్లూరు : చోరుల విజృంభణతో కొల్లూరు పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. కొల్లూరు జగనన్న కాలనీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్‌మెర్సిబుల్ మోటార్లతోపాటు, నివాసితులు ఏర్పాటు చేసుకున్న చేతి పంపులు, విద్యుత్ మోటార్లను ఎత్తుకుపోతున్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలో రూ. 2.20 లక్షలు విలువ చేసే ఎనిమిది సబ్‌మెర్సిబుల్ మోటార్లను రాత్రిపూట దొంగలు ఎత్తుకుపోయినట్లు కాలనీలో గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులు వాపోయారు. తాజాగా శుక్రవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు కాలనీలోని విద్యుత్ మోటార్ల వద్దకు వెళ్లగా, అక్కడ పనులు చేసుకుంటున్న వారిని చూసి ఉడాయించారు. కొల్లూరు కరకట్ట దిగువున ఉన్న చెత్త సంపద కేంద్రంలో విద్యుత్ మోటారు, చేతి పంపు, అక్కడ ఉన్న గది తలుపులు పగలకొట్టి ఎలక్ట్రికల్ కాటా, ఇతర సామగ్రిని ఎత్తుకుపోయేందుకు గోతాలలో మూటలు కట్టి సమీపంలోని చెట్ల పొదల్లోకి తరలించారు. ఉదయం చెత్త సంపద కేంద్రం వద్దకు వెళ్లిన పారిశుద్ధ్య సిబ్బంది అక్కడ పరిస్థితిని గమనించి పంచాయతీ అధికారులకు సమాచారమిచ్చారు. పోలీసులు నిఘాను పటిష్టం చేసి దొంగతనాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం

బాణసంచా కాల్చి సందడి చేసిన కార్యకర్తలు



భట్టిప్రోలు పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కర్లపాలెం: బాపట్ల అసెంబ్లీ నియోజక వర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కోన రఘుపతి పేరును ఇడుపులపాయలో సీఎం జగన్ ప్రకటించటంతో కర్లపాలెం మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు శనివారం బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐలాండ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీజే బండితో, ద్విచక్ర మోటారు వాహనాలపై ఎమ్మెల్యే కోన రఘుపతిని కలిసేందుకు బాపట్ల తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు వందరబోయిన సుబ్బారావు, పరమానందకుమార్, సీతారామిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, యల్లావుల ఏడుకొండలు, పి.వి.సురేష్, అక్కల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మిన్నంటిన సంబరాలు

భట్టిప్రోలు: వేమూరు, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా వరికూటి అశోక్‌బాబు, డాక్టర్ మేరుగ నాగార్జున, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా నందిగం సురేష్‌లకు టికెట్లు కేటాయించడంపై భట్టిప్రోలులో సంబరాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద టపాసులు, బాణసంచా భారీఎత్తున కాల్చారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు కుందేటి రమేష్, పడమట శ్రీనివాసరావు, పడమట సాయి, దారా చెన్నయ్య, వేల్పూరి నాగేశ్వరరావు, వాకా అంకబాబు, పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



కొల్లూరు పోలీసు స్టేషన్ సమీపంలో మాజీ సీఎం ఎన్‌టీఆర్ విగ్రహాన్ని కప్పుతున్న సిబ్బంది



బాపట్లలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

చెరుకుపల్లి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున గ్రామాల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు, జెండాలు, గోడలపై కరపత్రాలు, పేర్లను వెంటనే తొలగించాలని తహసీల్దార్ బి.బ్రహ్మం ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై శనివారం వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు.సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

కొల్లూరులో..

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల నిబంధనల మేరకు మండలంలోని దివంగత సీఎం వైఎస్సార్, మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహాలను టార్పాలిన్‌లతో కప్పి బహిరంగంగా కనిపించకుండా చేపట్టారు.

కర్లపాలెంలో..

ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని తహసీల్దార్ నిర్మలానందబాబా చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వీఆర్వోలకు, బూత్ స్థాయి అధికారులకు సమావేశం నిర్వహించారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగించాలని తహసీల్దార్ ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో నేతాజీ, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, పీఆర్ ఏఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

వేమూరులో..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని నియోజక వర్గం ఎన్నికల అధికారి వీరా వసంతరాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల కోడ్‌పై నియోజకవర్గ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొలిటికల్ హోర్డింగులు, పోస్టర్లు, గోడ రాతలు తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల తహసీల్దార్లు కిరణ్, పుల్లారావు, మునిలక్ష్మి, కవిత, విశ్వనాథ్, ఎన్నికల డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, వేమూరు, చుండూరు సీఐలు పి. రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాపట్లలో..

ఎన్నికల కోడ్ రావటంతో మున్సిపల్ అధికార యంత్రాంగం కదిలింది. రోడ్లపై రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగించే పనులకు శనివారం చేపట్టింది. వివిధ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగ్గారు. ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా ఎవరూ పని చేయరాదని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ సూచించారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు తదితరులు

రేపల్లె రూరల్: పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని గుళ్లపల్లి సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు శనివారం ఉదయం ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేసి మాట్లాడారు. పేదలకు స్థలం అందించి సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం పరితపిస్తున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు మినుము, పెసర కొనుగోలు

చెరుకుపల్లి: రబీ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న మినుము, పెసర పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ తెలిపారు. మండలంలోని పలు ఆర్‌బీకేలను శనివారం ఆయన సందర్శించి, రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ మార్కెట్ ఆధ్వర్యంలో నాఫెడ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కనీసం మద్దతు ధర మినుముకు క్వింటా రూ.6,950, పెసర క్వింటాకు రూ.8,558గా ప్రకటించినట్లు తెలిపారు. పంటను అమ్మదలచిన రైతులు రైతు భరోసా కేంద్రాలలోని వ్యవసాయ సహాయకుల ద్వారా పేర్లు నమోదు చేయించుకోవాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, ఆర్బీకే అధికారులు పాల్గొన్నారు.

ఆహారంలో చిరుధాన్యాలతో ఆరోగ్య భద్రత



సదస్సులో మాట్లాడుతున్న తారా సత్యవతి

బాపట్ల: ఆహారంలో చిరుధాన్యాలతో ఆరోగ్య భద్రత లభిస్తుందని భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ సంచాలకులు డాక్టర్ ఈ. తారా సత్యవతి పేర్కొన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో మండలంలోని మర్రిపూడిలో శనివారం చిరుధాన్యాలు, స్థానిక పంటల సాగు, ఉత్పత్తి, వినూత్న ప్రాసెసింగ్‌పై సాంకేతిక సదస్సు నిర్వహించారు. సత్యవతి మాట్లాడుతూ ఆరోగ్య భద్రతకు చిరుధాన్యాలు ప్రత్యామ్నాయ పంటలుగా సూచించారు. కృష్ణ, గోదావరి డెల్టా బేసిన్‌లో సజ్జలు మంచి దిగుబడితో పాటు రైతులకు లాభాలు వస్తాయని తెలిపారు. డాక్టర్ విజయభినందన మాట్లాడుతూ రైతులందరూ చిరుధాన్యాల్ని రోజువారి ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు హాస్టల్లో మెనూగా ఈ చిరుధాన్యాలను ఆహారంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సదస్సులో రైతులకు చిరుధాన్యాల సాగుపై భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ.సుబ్బరాయుడు, డాక్టర్ అరుణ, డాక్టర్ సుజనారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సేవానాయక్, శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, రైతులు, కళాశాల విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తగలబెట్టడం హేయమైన చర్య



వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

కర్లపాలెం: వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ తగలబెట్టటం హేయమైన చర్య అని ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి ఖండించారు. కర్లపాలెం గమేషన్ మిల్లు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సీఎం జగన్ సిద్ధం ఫ్లెక్సీకి శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. స్థానికులద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు ముందుగా పార్టీ కార్యాలయానికి చేరుకుని దగ్ధమైన ఫ్లెక్సీని పరిశీలించారు. అనంతరం పార్టీ మండల కన్వీనర్ య ల్లావుల ఏడుకొండల అధ్యక్షతన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల వాతావరణం నెలకొన్న స మయంలో ఫ్లెక్సీలను తగులబెట్టటం వలన పార్టీకి ఎలాంటి నష్టం ఉండదని తెలిపారు. సీఎం జగన్, కోన రఘుపతిల గెలుపును ఎవరూ ఆపలేరని చెప్పారు. పార్టీ మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు మాట్లాడుతూ దుండగులు ఎవరైనప్పటికీ చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేసి దోషులను గుర్తించి చట్ట ప్రకారం శిక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జనార్దన్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పరమానందకుమార్, నాగేశ్వరరెడ్డి, పెద్ద శ్రీనివాస రెడ్డి, అమీర్‌బేగ్, నాగరాజు, ఆసిఫ్ అలీ, జయ భారత్‌రెడ్డి, జానీ, నాగిరెడ్డి, షంషీర్, మనోహర్ పాల్గొన్నారు.

మినీ రక్షిత మంచినీటి పథకం ప్రారంభం



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మోపిదేవి , నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్

రేపల్లె రూరల్: పేటేరు ఆంజనేయస్వామి కాలనీలో పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన మినీ రక్షిత మంచినీటి పథకాన్ని శనివారం ఉదయం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ప్రారంభించారు. పంచాయతీ నిధులు రూ.4లక్షలతో పైప్‌లైన్, పంప్‌హౌస్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. దీంతో ఆంజనేయస్వామి కాలనీలో ప్రజలకు తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, సర్పంచ్ కనపర్తి వసుమతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి రవికిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెదపులివర్రులో 20 నుంచి బ్రహ్మోత్సవాలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): మండలంలోని పెదపులివర్రులో కొలువైన శ్రీ భూ నీళా సమేత శ్రీ వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఆలయం వ్యాఘ్రపాద మహర్షి ఆశ్రమం. శ్రీ రాజరాజ నరేంద్రుని దృష్టిని ఆకర్షించిన పవిత్ర క్షేత్రం. శ్రీ వ్యాఘ్రపాద మహర్షి కోరికపై శ్రీ కంచి వరదరాజస్వామి ఇక్కడ వెలిశారు. శ్రీ రాజరాజ నరేంద్రుడు ఆలయ ప్రాకారాలు నిర్మించి నల్లూరి వంశస్థులను అర్చకులుగా నియమించారు. శ్రీమద్ రామానుజాచార్యులవారు విడిది చేసి శ్రీవరదరాజస్వామిని సేవించడం వల్ల పవిత్ర క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఈ దేవాలయాన్ని 1512లో బెజవాడ సామ్రాజ్యాధినేతలు పునః ప్రతిష్ఠించినట్లు శాసనాలున్నాయి. స్వామి కల్యాణం పంచాహ్నికంగా, వైభవంగా ఫాల్గుణ పౌర్ణమికి జరగనున్నది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ వరకు పూజలు జరుగుతాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి మేకా సాంబశివరావు తెలిపారు.

త్యాగాలకు, సేవాతత్పరతకు ప్రతీకలు ఆర్యవైశ్యులు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి , నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గణేష్



భట్టిప్రోలులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వాసవీ క్లబ్ నిర్వాహకులు



అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలేస్తున్న డాక్టర్ జాన్‌వెస్లీ

రేపల్లె రూరల్: మహనీయుల సేవలను గుర్తుచేసుకోవటం ప్రతి పౌరుని బాధ్యతని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని ఓల్డ్‌టౌన్ అంకమ్మ చెట్టు సమీపంలో మహాత్మ గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు, కొణిజేటి రోశయ్యల విగ్రహాలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావులతో కలిసి ఆయన ప్రారంభించారు. త్యాగాలకు, సేవాతత్పర గుణాలకు ప్రతీకలు ఆర్యవైశ్యులని కొనియాడారు. బ్రిటిష్ వారితో మహాత్మాగాంధీ పోరాడగా, ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు తన జీవితాన్ని త్యాగం చేసి అమరజీవిగా నిలిచారన్నారు. అపరచాణిక్యుడిగా, రాష్ట్రముఖ్యమంత్రిగా తన వంతు సేవలను కొణిజేటి రోశయ్య అందించారని, ఆయన మన జిల్లాకు చెందిన వ్యక్తి కావటం మనకు గర్వకారణమని తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ మాట్లాడుతూ పుష్కరాల సమయంలో కృష్ణా ఘాట్‌కు వచ్చిన భక్తులకు ఆర్యవైశ్యులు అందించిన సహకారాలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహాన్ని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, రోశయ్య విగ్రహాన్ని డాక్టర్ గణేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, కౌన్సిలర్ బొలిశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్ది బదిరీ నారాయణమూర్తి, సెక్రటరీ నంబూరు సత్యప్రసాద్, ట్రెజరర్ బీఎల్ శ్రీనివాస్, ఆర్యవైశ్య యువత ప్రెసిడెంట్ బొలిశెట్టి ధర్మేంద్ర, ట్రెజరర్ వేముల నాగరత్నప్రసాద్, నాయకులు తూనుగుంట్ల పాండురంగారావు, వేమూరి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, మహిళా సంఘ సభ్యులు మద్ది పద్మజ, బొలిశెట్టి లక్ష్మి పాల్గొన్నారు.

ఆశయ సాధన కోసం అమరుడైన పొట్టి శ్రీరాములు

బాపట్ల: ఆశయ సాధన కోసం అహర్నిశలు కృషి చేయడంతో పాటు ఆత్మ త్యాగానికి సైతం సిద్ధపడిన పొట్టి శ్రీరాములు దేశం గర్వించదగ్గ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వి. శ్రీనివాసరావు కొనియాడారు. కళాశాలలో శనివారం జరిగిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పొట్టి శ్రీరాములు అంకితభావాన్ని, పట్టుదలను ప్రేరణగా తీసుకుని విద్యార్థులు పయనిస్తే ఉన్నత శిఖరాలను అందుకుంటారని తెలిపారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె.శ్రీనివాస రావు, సీహెచ్. సంధ్యారాణి, ఎం.లత, షేక్ హసీనా బేగం, సీనియర్ ప్రొఫెసర్ యస్. ఆర్. కోటేశ్వరరావు, కె.చంద్రశేఖర్, డి.వి.సాయిరాంకుమార్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం నిర్వహణ అభినందనీయం

కర్లపాలెం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. పొట్టి శ్రీరాములు సేవా సమితి, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో 58మంది దాతలు రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు సేవా సమితి అధ్యక్షుడు బి.రాంబాబు, సభ్యులు వేణుగోపాల్, కె.సత్యనారాయణ, టి.వి. సుబ్బారావు, కోడూరి చంద్రం, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు బి.ఎస్.నారాయణభట్టు, ఇనకొల్లు పోలీస్‌రావు, గిరిజన సేవా సంఘం అధికార ప్రతినిధి ఏకసిరి నరసింహారావు, వాసవీ క్లబ్ సభ్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

వెల్లటూరు(భట్టిప్రోలు): పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలోని పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు, అధ్యక్షులు నాగళ్ల ఆంజనేయులు, కోశాధికారి అన్నవరపు వెంకటేశ్వరరావు,నంబూరు నాగభూషణరావు, సుగ్గుల దుర్గాప్రసాదు, ఎస్.మధు, ఎన్. కృష్ణారావు, లోకనాథం పాల్గొన్నారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు వాసవీ, వనితా క్లబ్, ఆర్యవైశ్య మహిళా సంఘాల ఆధ్వర్యంలో శనివారం పొట్టిశ్రీరాములు 123వ జయంతిని పురస్కరించుకుని భట్టిప్రోలు రథం సెంటర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, తూనుగుంట్ల సాయిబాబా, బొలిశెట్టి శ్రీనివాసరావు (బీఎస్సార్),బూర్లె సుబ్బారావు, శనగపల్లి శ్రీనివాస ప్రసాదగుప్తా, కె. రవికుమార్, ఎ. వాలేశ్వరరావు, సీహెచ్. ఉమామహేశ్వరరావు, ఎం. జగన్నాథం, టి. మల్లికార్జునరావు, టి. నాగ సుధారాణి, కె.ఎస్.వి. రవితేజ, బి. చంద్రశేఖరరావు, కె.ఎస్. జయలలిత, టి. బేబీరాణి, ఎం. లక్ష్మీప్రియ పాల్గొన్నారు.

యువత ఆదర్శంగా తీసుకోవాలి

బాపట్ల టౌన్: మహనీయుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జాన్‌వెస్లీ తెలిపారు. బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం అమరజీవి పొట్టిశ్రీరాములు 123వ జయంతి వేడుకలను నిర్వహించారు.తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ శారదకు షారోన్ అంతర్జాతీయ సేవా అవార్డు



డాక్టర్ శారదకు అవార్డు ప్రదానం చేస్తున్న ఖలేదా నసీమ్, రాజకుమారి, డాక్టర్ అన్నపూర్ణ

తెనాలి: కెనడా దేశానికి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు షారోన్ పేరిట ఏర్పాటుచేసిన అంతర్జాతీయ సేవా అవార్డు-2014 ప్రదానోత్సవాన్ని శనివారం నిర్వహించారు. స్వచ్ఛంద సేవా సంస్థ పెన్నీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో స్థానిక రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో ఏర్పాటైన సభలో పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారదకు సేవా మెడల్‌ను, అవార్డును ప్రముఖుల చేతులమీదుగా ప్రదానం చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. సత్కార గ్రహీత డాక్టర్ శారద మాట్లాడుతూ వైద్య ప్రమాణాన్ని గౌరవిస్తూ వైద్యులు నిస్వార్థంగా వైద్యం అందించాలనేది తన అభిమతమన్నారు. కరోనా రోజుల్లో ఇంటింటికీ వైద్యం అందించగలగటం, ఇప్పుడు మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలికి కృషిచేయటం, ధర్మ టెలీహెల్త్ ప్రాజెక్టుతో కొన్ని ప్రాణాలను నిలపటానికి మించిన సంతృప్తి మరొకటి లేదన్నారు. ధర్మ ప్రాజెక్టు త్వరలో గేమ్ ఛేంజర్ కాగలదన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్ శారద బాధితులకు అందించిన సేవలు సాహసోపేతమన్నారు. ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ సొంత లాభం మానుకుని వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్న శారద మానవతను కొనియాడారు. డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులతోపాటు కరోనా రోగుల సేవలో శారద పాలుపంచుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఐనంపూడి శరత్‌బాబు, డాక్టర్ ప్రేమ్‌చంద్, డాక్టర్ రాకేష్, రోటరీ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుత్తా వెంకటరత్నం పాల్గొన్నారు.